తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శనివారం 06 - 06 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2

## రోడ్డు పనులు మొదలు పెట్టలే..

# ఎమ్మెల్యే గారూ నిరాహార దీక్ష ఎప్పుడు చేస్తారు..?

### మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి



- ఎమ్మెల్యేను అధికారులు కూడా లెక్క చేయడం లేదు
- ప్రజావసరాల కంటే కమిషన్లే ముఖ్యమా
- ఎమ్మెల్యే బాధ్యత వహించి రాజీనామా చేయాలి

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రం నుంచి రాజన్నగూడెం వరకు చేపట్టిన రోడ్డు పనులను అధికారులు జూన్ 4 వరకు ప్రారంభించకపోతే 5న నిరాహార దీక్ష చేస్తానని చెప్పారని, రోడ్డు పనులు నేటికీ మొదలు పెట్టలేదని, ఎమ్మెల్యే నిరాహార దీక్ష ఎప్పుడు చేస్తారో చెప్పాలని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023లో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ మోత్కూరు నుంచి రాజన్నగూడెం వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.5.80 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారని తెలిపారు. ఎన్నికల తర్వాత ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ ఆ పనులకు మళ్లీ శిలాఫలకం వేసి పనులు ప్రారంభించారని, రెండున్నరేళ్లు దాటినా పనులు ఎందుకు పూర్తికావడం లేదన్నారు. సీఎం, ఎమ్మెల్యేకు ఎన్నికలు ఉంటే పనులు గుర్తుకు వస్తాయని, మున్సిపల్ ఎన్నికలకు ముందు రోడ్డు పనులు చేస్తున్నట్టు షో చేశారని, ఇప్పటికే ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారని, కాంట్రాక్టర్లు ఎందుకు మారుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీ లోగుట్టు వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజావసరాల కంటే మీ కమిషన్లే ముఖ్యమా అని ప్రశ్నించారు. కమిషన్లకు ఆశపడకపోతే ఎమ్మెల్యే కచ్చితంగా నిరాహార దీక్ష చేసేవారన్నారు. ఎమ్మెల్యే చెప్పినా అధికారులు మాట వినడం లేదంటే ఆయనకు అధికారులపై ఏమాత్రం పట్టు లేదని అర్థమవుతుందని, ఎమ్మెల్యే అసమర్థతకు నిదర్శనమని, బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తయినా మోత్కూరు మున్సిపాలిటీలో మాత్రం ఆ పదవులను భర్తీ చేయలేని అసమర్థ ఎమ్మెల్యే సామేలేనని విమర్శించారు. స్వంత పార్టీ కౌన్సిలర్లే ఎమ్మెల్యే మాట విననప్పుడు ఇక అధికారులు ఏం వింటారన్న చర్చ ప్రజల్లో జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మాట మీద నిలబడి ప్రజావసరాల కోసం రోడ్డు పనుల పూర్తి కోసం నిరాహార దీక్ష చేయాలని కోరారు.

# స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఎస్ఎస్సీ బ్యాచ్ స్నేహితురాలు వరికుప్పల విజయ తల్లి అండాలు ఇటీవల మృతి చెందగా తోటి స్నేహితులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. దత్తప్పగూడెం హైస్కూల్‌కు చెందిన 2009-10 ఎస్ఎస్సీ బ్యాచ్ స్నేహితులు శుక్రవారం విజయ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. విజయ తల్లిదండ్రులు ఇద్దరు చనిపోవడంతో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు నరేష్, శ్రీకాంత్, సందీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.